ప్రజాశక్తి

గురువారం 13 జులై 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

సమస్యల్లో సాగు

- ఊపందుకోని వ్యవసాయం
- నీటి విడుదలలో జాప్యం
- అస్తుబిస్తుగా గృహ నిర్మాణం
- నేడు డిఆర్‌సి సమావేశం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లా సమీక్ష కమిటీ (డిఆర్‌సి) సమావేశం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధ్యక్షతన గురువారం జరగనుంది. వ్యవసాయ, ఉద్యాన, నీటి పారుదల రంగాలతో పాటు గృహ నిర్మాణం, జగనన్న కాలనీల్లో ప్రగతి, జాతీయ ఉపాధి హామీ పథకం, విద్య, వైద్యం, జగనన్న భూ హక్కు తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. వివిధ అంశాలపై జరిగే చర్చల్లో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పలు సమస్యలను ప్రస్తావించనున్నారు.

ప్రస్తుతం జిల్లాలో ఖరీఫ్ సాగు మందకొడిగా సాగుతోంది. జిల్లాలో 2.60 లక్షల ఎకరాల్లో పంటలు వేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు కేవలం నాలుగు వేల ఎకరాల్లోనే సాగైంది. గతనెలలో సాగునీటికి ప్రకాశం బ్యారేజికి నీరు విడుదల చేసినా కాల్వలకు నీటి విడుదలలో తీవ్ర జాప్యమవుతోంది. బుధవారం నుంచి పశ్చిమ డెల్టాకు 1116 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జిల్లాలో 1.66 లక్షల ఎకరాల్లో వరి సాగవ్వాల్సి ఉన్నా ఇప్పటి వరకు 300 ఎకరాల్లోనే వరి వెదపద్ధతిలో సాగైంది. వరినాట్లు ఇంకా ప్రారంభం కాలేదు. పత్తిని 3 వేల ఎకరాల్లోనే వేశారు. మరో 700 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఉద్యాన సాగుకు సంబంధించి కూరగాయల సాగు పెంపుపై అధికారులు దృష్టి సారించడం లేదు. రాజధాని గ్రామాల్లో వ్యవసాయం ఉపసంహరణ తరువాత ప్రత్యామ్నాయంగా ఇతర ప్రాంతాల్లో ఉద్యానసాగును ప్రోత్సహించలేదు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిన తరువాత కూడా కాల్వల పూడిక తీత, తూడాకు పనులు ప్రారంభం కాలేదు. పనులన్నీ టెండర్ల దశలోనే ఉన్నాయి. ఆల్మట్టిలో నీరు లేకపోవడం వల్ల ఈఏడాది సాగర్, పులిచింతలకు ఎప్పుడు నిండుతాయన్నదీ ప్రశ్నార్థకంగా మారింది. సాగర్ జలాశయంలో గరిష్ట నీటి నిల్వ 312.04 టిఎంసిలు సామర్థ్యం ఉండగా బుధవారం నాటికి 147.46 టిఎంసిలు ఉన్నాయి. గతేడాది ఇదే రోజుకు 165.23 టిఎంసిలు నిల్వ ఉంది. పులిచింతల గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసిలు కాగా ప్రస్తుతం 22.92 టిఎంసిలకు తగ్గిపోయింది. గతేదాది ఇదే రోజుకు 32.83 టిఎంసిల నిల్వ ఉంది.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో పలు మండలాలు బాగా వెనుకబడి ఉన్నాయి. రాష్ట్రంలో గుంటూరు జిల్లా బాగా వెనుకబడి ఉంది. ఉగాది నాటికి 8 వేల ఇళ్లు పూర్తి

▶ 2లో

విలేకర్లతో మాట్లాడుతున్న పాశం రామారావు

గుంటూరు ఛానల్ పొడిగింపునకు

సత్వరమే నిధులివ్వాలి

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగింపునకు నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రామారావు డిమాండ్ చేశారు. పెందనందిపాడుకు బుధవారం వచ్చిన ఆయన స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో విలేకర్లతో మాట్లాడార. 50 గ్రామాలకు తాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఈ గుంటూరు ఛానల్ పొడిగింపు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. సుదీర్ఘకాలం నుంచి ఈ ప్రాంత రైతులు, ప్రజలు దీనికోసం ఎన్నో పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాల హామీలతో సరిపెడుతున్నాయేగాని ఆచరణకు మాత్రం పూనుకోవడం లేదని విమర్శించారు. నేటి ప్రభుత్వం భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చి నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. ఈ ప్రాంతంలో రైతులు కేవలం వర్షాధారం మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని, అతివృష్టి, అనావృష్టితో నష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నల్లమడ వాగులోని కలుషితమైన నీరు సాగుకు వాడటం వల్ల పొలాలు చౌడువారిపోతున్నాయని చెప్పారు. పలు గ్రామాల్లో తాగునీటికి, వాడుకోవడం కోసం నీరు సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గుంటూరు ఛానల్‌ను పొడిగించడం అత్యవసరమని చెప్పారు.

▶ 2లో

మాట్లాడుతున్న సాధన సమితి నాయకులు

మూడో శిలాఫలకం వద్దు

- నేరుగా ప్రాజెక్టు పనులు చేపట్టండి
- ఎన్నికల సంవత్సరంలో మళ్లీ మోసం
- వరికపూడిశెల ప్రాజెక్టు సాధన సమితి

ప్రజాశక్తి - వినుకొండ

వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణానికి మూడవ శిలాఫలకం వద్దని నేరుగా పనులు ప్రారంభించాలని ప్రాజెక్టు సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన బొల్లాపల్లిలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం, వరికపూడిశెల ప్రాజెక్టు సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. సదస్సుకు బొల్లాపల్లి మండలంలోని అనేక గ్రామాల నుండి రైతులు, వ్యవసాయ కూలీలు హాజరయ్యారు. రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల పల్నాడు జిల్లా కార్యదర్శులు ఏపూరి గోపాలరావు, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి గిరిజన సంఘం నాయకులు వి.కోటనాయక్, సాధన సమితి నాయకులు రూబిన్, భూక్య రాంజీ తదితరులు మాట్లాడారు. పల్నాడు ప్రాంతంలోని వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి మండలాలతో పాటు ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలంలోని సుమారు లక్షకు పైగా ఎకరాలకు సాగునీరు, ఆయా గ్రామాలకు శాశ్వత తాగునీరు అందించే వరికపూడిశెల ప్రాజెక్టు కోసం 40 ఏళ్లకు పైగా ఈ ప్రాంత ప్రజలు పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం వాగ్దానాలు చేసిన వారు గద్దెనెక్కాక ప్రజలను

▶ 2లో

రాజధానిలో ఇళ్ల నిర్మాణానికి పచ్చజెండా

- రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం
- స్థలాల కేటాయింపుపై 17 నుంచి హైకోర్టు విచారణ

2లో

బెల్లంకొండ నుండి తెచ్చిన మట్టిలో వజ్రాలున్నాయంటూ వెదుకులాట!

వజ్రాల వదంతులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వజ్రాలు దొరుకుతున్నా యనే ప్రచారంతో వాటికోసం పలువురు వేట మొదలు పెట్టారు. సత్తెనపల్లి బసవమ్మ వాగు సమీపంలోని పొలంలో వజ్రాలు దొరుకుతున్నాయంటూ బృందాలుగా అన్వేషి స్తున్నారు. బసవమ్మ వాగు ఒడ్డున ఉన్న పొలాన్ని చదును కోసం యజమాని బెల్లంకొండ ప్రాంతం నుండి ఎర్రమట్టిని తెచ్చారు. ఈ మట్టిలో వజ్రాలు దొరికాయని ప్రచారమవడంతో పలువురు పనులు మానుకుని మరీ వెళ్లి వజ్రాల కోసం వెదుకుతూ ప్రతి రాయినీ తీక్షణంగా పరిశీలిస్తున్నారు. దీనికితోడు వారికి దొరికింది వీరికి దొరికింది అంటూ సోషల్ మీడియాలో వదంతులతో ఇతర ప్రాంతాల వారూ వెదుకులాటకు వస్తున్నారు.

అరుణాంజలి

మానవత్వం మూర్తీభవించిన మాతృమూర్తి,
కుటుంబ శ్రేయస్సుకు పార్టీ విస్తరణకు కృషిచేసిన
కా॥ భూనం సరోజిని గారికి
అరుణాంజలి ఘటిస్తూ......

కుమారులు - కోడళ్ళు
భూనం చిన రామారావు - వెంకట సీతారావమ్మ
భూనం సుబ్బారావు - వెంకటరమణ

కుమార్తెలు :
సౌరవతి నాగేశ్వరి
మొలబంటి హైమావతి
కోటగిరి కావమ్మ (లేటు)
చెన్నం శివకుమారి
చెన్నం భారతి

మనవళ్లు - మనవరాళ్ళు
కోటగిరి స్వరూప,
కోటగిరి ధనలక్ష్మి
భూనం గిరీష్

కీ॥శే॥ భూనం సరోజిని గారు
మరణం : 03-07-2023
కాజ గ్రామం, మంగళగిరి మండలం.

సంస్మరణ సభ : ది.13-7-2023 ఉదయం 10 గం.లకు కాజ గ్రామంలోని మా స్వగృహం నందు జరుగును.

రాజధానిలో ఇళ్ల నిర్మాణానికి పచ్చజెండా

- **రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం**
- **స్థలాల కేటాయింపుపై 17 నుంచి హైకోర్టు విచారణ**

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాజధాని గ్రామాల్లో ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన పేదలకు పంపిణీ చేసిన స్థలాల్లో ఇళ్లు నిర్మించాలని రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించింది. గురువారం సిఎం వైయస్.జగన్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో ఈమేరకు ఆమోదం తెలిపారు. ఆర్-5 జోన్‌తో పాటు ఎస్-3 జోన్‌లో కేటాయించిన స్థలాల్లో ఈ నెల 24న ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని మంత్రి మండలిలో నిర్ణయించారు. 25 లే అవుట్లలో 50,793 మందికి 1366.48 ఎకరాల్లో విస్తీర్ణంలో పట్టాలివ్వగా 47,017 ఇళ్లు మంజూరయ్యాయి. ఇళ్ల నిర్మాణం చేపట్టనున్న లే అవుట్లలో మౌలిక సదుపాయాల కోసం రూ.384.52 కోట్లు కేటాయింపునకు కూడా మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇళ్ల నిర్మాణంకు తొలుత అనుమతి ఇచ్చి కోర్టు కేసులు తేలే వరకు తాము నిధులు మంజూరు చేయబోమని కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు పెట్టినా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. తొలి విడత 47,017 ఇళ్లు నిర్మించి తీరాలని నిర్ణయించింది. ఇందుకు మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది.

అయితే ఈనెల 17 నుంచి రాజధానిలో ఆర్-5లో స్థలాల కేటాయింపుపై హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణ ప్రారంభించనుంది. స్థలాల కేటాయింపు, ఇళ్లనిర్మాణంపై రైతులు దాఖలు చేసిన పిటీషన్లపై రాష్ట్ర హైకోర్టు విచారణ జరపనుంది. ఈ నేపథ్యంలో ఇళ్ల నిర్మాణం విషయంలో లబ్ధిదారుల్లో నెలకొన్న అమోమయంపై హైకోర్టు ఇచ్చే తీర్పుతో స్పష్టత రానుంది. ఈ అంశంలో కోర్టులో కేసులు కొనసాగుతున్నా ప్రభుత్వం తన పని తాను చేసుకుపోతోంది. ఈనెల 8న ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన జరగాల్సి ఉన్నా కేంద్రం పెట్టిన మెలిక వల్ల శంకుస్థాపన నిలిచిపోగా ఈ కార్యక్రమాన్ని ఈనెల 24న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే 25 లే అవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కొరత ఉందని అధికారులు,కాంట్రాక్టర్లు తటపటాయిస్తున్న నేపథ్యంలో ఒకేసారి రూ.384.52 కోట్ల మంజూరుకు కూడా బుధవారం మంత్రి మండలి ఆమోదం తెలపడంతో ఇక పనులు వేగం పుంజుకోనున్నాయి.

మూడో శిలాఫలకం వద్దు

(మొదటి పేజీ తరువాయి)

మోసం చేస్తూనే ఉన్నారని విమర్శించారు. గతంలో చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా వరికెపూడిశెల నిర్మాణం అంటూ శిలాఫలకాలను ఆవిష్కరించినా పనులు మాత్రం చేయలేదని, గత టిడిపి ప్రభుత్వం రూ.320 కోట్లు కేటాయించినట్లు చెప్పినా అప్పుడూ పనులు చేపట్టలేదని గుర్తు చేశారు. తాము అధికారంలోకి రాగానే వరికపూడిశెల చేపడతానని ఎన్నికలకు ముందు హామీనిచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి సిఎం అయ్యాక నాలుగేళ్లు అటవీ, పర్యావరణ శాఖల అనుమతుల పేరుతో పబ్బం గడిపారని, తిరిగి ఎన్నికలు ముంచుకురావడంతో అధికార పార్టీ నేతలకు ఈ ప్రాజెక్టు మళ్లీ గుర్తొచ్చిందని విమర్శించారు. అటవీ, పర్యావరణం, వన్యప్రాణుల సంరక్షణ శాఖల నుండి అనుమతులు వచ్చాయంటూ బూటకపు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. రిజర్వ్ ఫారెస్ట్ నుండి పులుల అభయారణ్యం అనుమతులకై స్టాండింగ్ కమిటీ చర్చల అనంతరం సిఫారసు చేసేందుకు కొన్ని షరతులతో లోబడి ఉన్న నిర్ణయాన్ని పంపించారుగాని ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర నుండి అనుమతులు రాలేదని తెలిపారు. ఢిల్లీలో రైతులు 13 నెలలు ఎండ, వాన, చలిని తట్టుకుంటూ నల్ల చట్టాలను తిప్పికొట్టారని, ఆ స్ఫూర్తితో వరికపూడిశెల సాధన కోసమూ ఈ ప్రాంత రైతులు పోరాడాలని పిలుపునిచ్చారు. స్టాండింగ్ కమిటీ సిఫార్సులు తప్ప అనుమతులు లభించని వరికపూడిశెల ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారాలు మానుకొని రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.హనుమంత్‌రెడ్డి, సిపిఐ నాయకులు వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు హనుమాన్ నాయక్, బీఎస్పీ నాయకులు మన్నయ్య పాల్గొన్నారు.

వరికపూడిశెల సాధన సమితి ఎన్నిక

ఈ సందర్భంగా వరికపూడిశల సాధన సమితి మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా దామెర వెంకటరమణారావు, అధ్యక్షులు భూక్యరాంజీ నాయక్, ప్రధాన కార్యదర్శిగా మేడం లక్కిరెడ్డి, ఉపాధ్యక్షులుగా పులి మర్ల రూబెన్, సహాయ కార్యదర్శిగా వి.కోటనాయక్, కోశాధి కారిగా అట్లూరి గాలిరెడ్డి, 70 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

సత్వరమే నిధులివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

గుంటూరు ఛానల్ సాధన సమితి నాయకులు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును, ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌ను, గుంటూరు, బాపట్ల జిల్లాల కలెక్టర్లను కలసి ఈ ప్రాంత రైతుల సమస్యలను వివరించారని, వారు సానుకూలంగా స్పందించినా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం బాధాకరమని అన్నారు. గుంటూరులో నల్లమడ రైతుసంఘం ఆధ్వర్యంలో 14 రోజుల నుంచి రైతులు నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదన్నారు. ఈ విషయంలో రైతులకు సిపిఎం తన పూర్తి మద్దతు తెలియజేస్తోందని ఉద్ఘాటించారు. జగన్ పాదయాత్రలోనే కాకుండా ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు గుంటూరు ఛానల్ పొడిగింపు పనులు పూర్తి చేస్తామనే హామీనిచ్చారని గుర్తు చేశారు. సిఎం తన హామీని నెరవేర్చకుంటే భవిష్యత్తులో అన్ని పార్టీలు, రైతు సంఘాలను కలుపుకొని పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా ఉధృతం చేసేందుకు సిపిఎం సిద్ధమవుతోందన్నారు. సమావేశంలో గుంటూరు ఛానల్ సాధన సమితి నాయకులు ఎన్.ఆచార్యులు. సిపిఎం నాయకులు కె.నాగేశ్వరావు, కె.వెంకట సుబ్బారావు. సిహెచ్.యానాదులు, డి.శ్రీనివాసరావు, కె.బాబు పాల్గొన్నారు.

15వ రోజుకు గుంటూరు ఛానల్ దీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించాలని నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్ష 15 రోజులకు చేరుకుంది. బుధవారం దీక్షను పెదనందిపాడు మండల పరిషత్ మాజీ అధ్యక్షులు నర్రా బాలకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. పెదనందిపాడు హై లెవెల్ ఛానల్ తవ్వుతామని అనేక దశాబ్దాల నుండి హామీలు ఇస్తున్నా అమలుకు నోచుకోవట్లేదన్నారు. పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు మండలాల్లో భూగర్భ జలాలు లేవని, అందువల్ల సాగు, తాగునీరు కావాలంటే గుంటూరు ఛానలే మార్గమన్నారు. గుంటూరు ఛానల్ పొడిగించాలంటే భూసేకరణ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. అందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.కోటయ్య, నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కె.రాజమోహన్, డి.హరిబాబు, ఎన్.సుబ్బారావు, వై.అంకమ్మచౌదరి, ఎం.సౌరిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ధూళిపాళ్ల నరేంద్ర

ఉపా, ఎన్ఐఎ చట్టాలను రద్దు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న ప్రజాస్వామిక వాదులను దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ ఉపా లాంటి క్రూరమైన చట్టాలను మోపి ఏళ్ల తరబడి జైల్లో నిర్బంధించటం దుర్మార్గమని, వారిపై పెట్టిన ఉపా కేసులను తక్షణం ఎత్తివేయాలని విప్లవ రచయితల సంఘం సీనియర్ నాయకులు సిఎస్ఆర్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈనెల 15వ తేదీ విజయవాడ ధర్నా చౌక్‌లో ఉపా రద్దు పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాధర్నా కార్యక్రమ కరపత్రాలను, పోస్టర్లను స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద బుధవారం ఆవిష్కరించారు. కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ మాట్లాడుతూ దేశ ఖనిజ సంపదను, సహజ వాహనరులను ప్రజల భాగస్వామ్యంతో ఏర్పడిన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న పాలకులు తమను తాము దేశభక్తులుగా ప్రకటించుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుల నిర్మూలన పోరాట సమితి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య, పౌరహక్కుల సంఘం, చైతన్య మహిళా సంఘం, ప్రజా కళామండలి, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం, అమరుల బంధుమిత్రుల సంఘం, విరసం తదితర ప్రజాసంఘాల నాయకులపై రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో తప్పుడు ఆరోపణలతో అక్రమ కేసులు పెట్టారని ఆగ్రహించారు. తక్షణం కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.పోతురాజు, గనిరాజు, ఎన్.నీలాంబరం, బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విరసం, వివిధ సంఘాల నాయకులు

సమస్యల్లో సాగు

(మొదటి పేజీ తరువాయి)

చేయాలనే లక్ష్యం పూర్తి కాలేదు. ఉగాది వెళ్లిపోయి నాలుగునెలలు అయినా ఇంతవరకు గృహనిర్మాణం ఆశించిన విధంగా వేగం పుంజుకోలేదు. ప్రభుత్వ పాఠశాలలో నాడు-నేడు పనులు మందగమనంగా సాగుతున్నాయి. పాఠశాలల విలీనం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉన్నత పాఠశాలల్లో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేసినా అవసరమైన మేరకు అధ్యాపకులు లేరు. ఆశించిన స్థాయిలో విద్యార్థులు చేరడంలేదు. జగనన్న భూ హక్కు పథకం ద్వారా 223 గ్రామాల్లో సర్వే ప్రారంభించారు. 5.95 లక్షల ఎకరాల భూమి ఉంది. మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్‌లో కలిపిన గ్రామాలతోపాటు, సిఆర్‌డిఎ పరిధిలోని 29 గ్రామాల్లో సర్వే జరగడం లేదు. మొత్తంగా 50 గ్రామాల్లో సర్వే పనులు మినహాయించారు. మిగతా 173 గ్రామాల్లో రీ సర్వే పనులు జరుగుతున్నాయి. ఈ అన్ని అంశాల్లోని సమస్యలపై ప్రజాప్రతినిధులు సమావేశంలో ప్రస్తావించే అవకాశం ఉంది.

చేనేతలను గుర్తించని మోడీ ప్రభుత్వం

ప్రజాశక్తి-మంగళగిరి : దేశవ్యాప్తంగా ఉన్న చేనేతలను మోడీ ప్రభుత్వం గుర్తించడం లేదని అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ కార్యదర్శి జి.ధనుంజయరావు బుధవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. టెక్స్ టైల్ పరిశ్రమల జరీ ఉత్పత్తులది ప్రత్యేక స్థానమని, గుజరాత్‌లోని సూరత్ కేంద్రంగా 90 శాతం జరీ ఉత్పత్తులు తయారై దేశవ్యాప్తంగా సరఫరా అవుతాయని తెలిపారు. జరీ ఉత్పత్తులు రియల్, ఇమిటేషన్ అని రెండు రకాలుగా ఉంటాయని, రియల్ జరీని చేనేత రంగంలో ఉపయోగిస్తారని తెలిపారు. రియల్, ఇమిటేషన్ జరీలపై 12 శాతంగా జీఎస్టీ నిర్ణయించగా సూరత్‌కు చెందిన వ్యాపారుల లాబీయింగ్‌తో రియల్ జరీ పన్నును 5 శాతానికి తగ్గించుకున్నారని, ఇప్పుడు అదే సూరత్ వ్యాపారులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఇమిటేషన్ జరీపైన జీఎస్టీనీ 5 శాతానికి తగ్గించుకున్నారని తెలిపారు. గుజరాత్ రాష్ట్రానికే పరిమితమైన జరీ పరిశ్రమకు మేలు చేసేలా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకుందని, చేనేతపై జిఎసిని ఎందుకు తొలగించరని ప్రశ్నించారు. దీనికోసం ఆరేళ్లుగా పోరాటం చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా చేనేతపై జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీల రివర్షన్ నిలుపుదల చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లపై 85వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా రివర్షన్ ప్రక్రియను నిలుపుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునను గుంటూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ప్రమోషన్ ఇచ్చేటప్పుడు సీనియారిటీ ప్రకారం రోస్టర్ కమ్ మెరిట్ ఇస్తారని తెలిపారు. దీనిని ఫీడర్ కేడర్ సీనియారిటీగా పరిగణిస్తారని, మళ్లీ అదే ఉద్యోగి ప్రమోషన్ పొందేందుకు ఇదే నియమం వర్తిస్తుందని వివరించారు. కానీ దీనికి విరుద్ధంగా లా డిపార్ట్‌మెంట్ సెక్రటరీ చైర్మన్‌గా మరో ఇద్దరితో కలిసి ఒక కమిటీ వేశారని, ఈ కమిటీ క్యాచ్ ఆఫ్ రూల్ థియరీ పేరుతో ప్రభుత్వానికి నివేదిక సమర్పించిందని అన్నారు. దీంతో 2003 నుంచి ప్రమోషన్లు పొందిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు రివర్షన్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాన్ సీక్వెన్స్ సీనియారిటీ ఇవ్వాలని, క్యాచ్ ఆఫ్ రూల్ థియరీని రద్దు చేయాలని కోరారు. వీరికి మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు దార హేమప్రసాద్ ఉద్యోగ సంఘాలకు మద్దతుగా నిలిచారు. మంత్రిని కలిసిన వారిలో చుక్కా నాగభూషణం, అశోక్, కిరణ్ కుమార్, దేవరాజ్ ఉన్నారు.

ఆర్టీసీ అసిస్టెంట్ మెకానిక్‌కు ఎమ్‌డి పరామర్శ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రకాశం జిల్లా దర్శి సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో గాయాలపాలై, గుంటూరులోని అమృత హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పొదిలి డిపో అసిస్టెంట్ మెకానిక్ షేక్ షాహిద్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారా తిరుమలరావు బుధవారం పరామర్శించారు.అతనికి అందుతున్న వైద్యం సేవలను వివరాలను డాక్టర్ ద్వారా తెలుసుకున్నారు. షాహిద్‌ను పరామర్శించిన వారిలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణమోహన్, నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఆదం సాహెబ్, గుంటూరు జిల్లా ప్రజారావాణా అధికారి ఎం.రవికాంత్ తదితరులున్నారు.

రూ.1.66 కోట్లతో కృష్ణబాబు కాలనీలో రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-గుటూరు

గుంటూరు నగరంలో మౌలిక వసతుల కల్పనకు పాలకవర్గం అధిక ప్రాదాన్యతనిస్తుందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. బుధవారం కృష్ణబాబు కాలనీలో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు రూ.1.66 కోట్లతో సిసి రోడ్లకు ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌తో కలిసి మేయర్ శంకుస్థాపన చేశారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కె.గురవయ్య, ఎస్.ఉమామహేశ్వరి రాజేష్, ఎ.సంతోష్, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విద్యుత్ ట్రాన్‌ఫార్మర్ లారీకి తగిలి డ్రైవరు మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం స్థానిక అశోక్ నగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం అశోక్ నగర్ 4వలైనులో రోడ్డు పక్కన పార్కు చేసి లారీ తీసే క్రమంలో డోరు ట్రాన్స్ఫార్మ్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతంతో డ్రైవర్ ఎం.శ్రీనివాస్ (42) అక్కడికక్కడే క్రింద పడి మృతి చెందాడు. మతి చెందిన డ్రైవర్ ముప్పాళ్ల మండలం లంకెల˘హరపాడు కు చెందిన మిరియాల శ్రీనివాస్ గా గుర్తించారు. మతదేహాన్ని పోలీసులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పట్టాభిపురం సిఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

ఆలయ సూపరింటెండెంట్‌పై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక వైకుంఠపురం లోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సూపరింటెండెంట్ నిర్మల రాణి పై సస్పెన్షన్ వేటు పడింది. ఆలయ సహాయక కమిషనర్ తిమ్మనాయుడు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఆలయంలో హుండీ లెక్కింపు జరిగింది. లెక్కింపు సమయంలో నిర్మల రాణి ఓ బంగారపు ఉంగరాన్ని అపహరించారు. హుండీలో వచ్చిన ఆభరణాలను వేరు చేసే క్రమంలో ఆమె ఉంగరాన్ని వేలికి తగిలించుకోవడాన్ని సహ సిబ్బంది గమనించి, సహాయక కమిషనర్ కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై పూర్తి విచారణ అనంతరం ఆమెను సస్పెండ్ చేసినట్లు సహాయక కమిషనర్ తిమ్మనాయుడు స్పష్టం చేశారు .ఇదిలా ఉండగా గతంలో కూడా నిర్మల రాణి పెదకాకాని దేవాలయంలో కూడా ఇదే తరహా చేతివాటం ప్రదర్శించి, అక్కడ కూడా సస్పెండ్ అయినట్లు సమాచారం.

ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-నాదెండ్ల

ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా మండలంలోని సాతులూరు గ్రామంలో బుధ వారం అంగన్వాడి సెంటర్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ కె పద్మ పాల్గొన్నారు ప్రపంచ జనాభా దినోత్సవం గురించి ఆమె వివరించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు శ్రీని వాసరావు అంగన్ వాడి టీచర్స్ ఆయాలు తల్లులు పిల్లలు ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆటో అదుపుతప్పి బోల్తా - ఒకరు మృతి

ప్రజాశక్తి-నాదెండ్ల

వేగంగా వెళుతున్న ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి స్వల్ప గాయాలైన సంఘటన నాదెండ్లలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన విప్పర్ల మోహన్ రావు తల్లి ఇటీవల మతి చెందింది. ఆలయంలో నిద్ర చేసేందుకు భార్య ప్రమీలతో కలిసి చిలకలూరిపేటకు ఆటోలో బయలుదేరారు. డ్రైవర్ అజాగ్రత్త కారణంగా ఆటో బోల్తా పడింది. తీవ్ర గాయా లైన మోహన్ రావును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు వైద్యులు తెలిపారు దీనిపై నాదెండ్ల ఎస్సై ఆవుల భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర పంటల సాగు లాభదాయకం

ప్రజాశక్తి - యడ్లపాడు

ఖరీఫ్ లో ప్రధాన పంట ప్రతి పంటలో పలు రకాల అంతర పంటలు వేయటం ద్వారా రైతులకు అధిక లాభాలు పొందవచ్చని రీజినల్ కోఆర్డినేటర్ వెంకట్రావు అన్నారు. బుధవారం ఎడ్లపాడు మండలంలోని కోట గ్రామంలో ప్రకతి వ్యవసాయ విధానంలో పండిస్తున్నటువంటి పలు రకాలైన పంట పొలాలను పరిశీలించారు. గ్రామంలోని గొట్టం వెంకట్రావు 1 ఎకరం ప్రత్తి పంట చుట్టూ ఉన్న కాంపాక్ట్ బ్లాక్ 5 ఎకరాల రైతుల పొలంలో పంట వేసే ముందుగా 30 రకాల విత్తనాలను భూమిలో చల్లి 45 రోజుల తర్వాత భూమిలో కలయ దున్నటం జరిగిందని. అదేవిధంగా ప్రధాన పంటతో పాటు ఆరు సాళ్ళకుఒక సాలు కంది, బ్రోడర్ పంటగా జొన్న, మొక్కజొన్న, సజ్జ, బెండ, విత్తనాలను బీజామతంతో విత్తన శుద్ధి చేసి వేయడం జరిగింది. ప్రతి పంట సాళ్ళ మధ్యలో పెసర , మినుము ఆకుకూరలు, వరుసలోనే ప్రత్తి మొక్కల మధ్య దుంప పంటలు క్యారెట్, బీట్రూట్ ,ముల్లంగి , కూరగాయలు, వేయడం వలన భూమికి కావలసిన సూక్ష్మ పోషకాలు అభివృద్ధి చెంది జీవవైవిధ్యం పెరిగి ప్రధాన పంట ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

నారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం భాష్యం ప్రవీణ్ విద్యా ర్థులకు ఆర్థిక సాయం చేసినట్లు కావురు గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయ కులు కందుల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. చిలకలూరిపేట పట్టణంలోని కృష్ణమహల్ సెంటర్‌లోని నారా ఫౌండేషన్ కార్యాలయంలో కావూరుకి చెందిన విద్యార్థిని మల్లిపెద్ది యామినికి కాలేజీ ఫీజు నిమిత్తం రూ.25,000 ఆర్థిక సహాయాన్ని అందించారన్నారు.

'మా కుటుంబానికి తీరని అన్యాయం'

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

తన కుటుంబానికి తీరని అన్యాయం జరిగిందంటూ కెవిపిఎస్ ప్రతినిధి బృందం ముందు హతుడు సాంబశివరావు తల్లి, చిన్నమ్మాయి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబాన్ని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ ప్రతినిధి బృందం బుధవారం కలిసింది. చేతికొచ్చిన కొడుకును కోల్పోయానని, పట్టపగలు ఆర్ అండ్ బి రహదారి పక్కనే సజీవ దహనం చేసి హత్య చేశారని, భర్తను కోల్పోయిన తనకు అండగా ఉంటాడనుకున్న కొడుకును లేకుండా చేసి పొట్టన పెట్టుకున్నారంటూ వాపోయింది. పోలీసులు చేసిన విచారణలో అనుమానాలు ఉన్నాయని, అన్నం తింటున్న కొడుకును తీసుకుపోయిన బాజీని కేసు నుండి ఎందుకు తప్పించారు? ముద్దాయి యూసుఫ్ తో కలిసి బండిమీద వచ్చి చనిపోయాడా లేదా అని చూసిన సాయిని వదిలివేశారని అన్నారు. పోలీసు సెక్యూరిటీ ఇవ్వండి అని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ చెప్పిన అధికారులు ఇప్పటికీ పట్టించుకోలేదని ప్రతినిధి బృందానికి చెప్పింది.. పోలీస్ అధికారులు అనుమానాలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని అన్నం తింటున్న సాంబశివ రావును తీసుకు వెళ్లిన బాజీపై, చనిపోయాడా లేదా అని హతుడితో కలిసి పరిశీలన చేసిన సాయి, వారికి సహకరించిన రాజేష్‌లపై కూడా కేసు నమోదు చేయాలని. లేకుంటే దళిత, గిరిజన, ప్రజా సంఘాలతో తీవ్రమైన ఆందోళన చేయాల్సి వస్తుందని కెవిపిఎస్ బృందం హెచ్చరించింది. కుటుం బంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వాలని అధికారులను కెవిపిఎస్ పల్నాడు జిల్లా కార్యదర్శి జి రవిబాబు డిమాండ్ చేశారు. ప్రతినిధి బృందంలో తెలకపల్లి శ్రీనివాసరావు, జగన్నాథం, కొండలు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	47,122
మిర్చి ఎగుమతి	:	46,937
మిర్చి నిల్వ	:	16,010

మిర్చి ధరలు

రూపాయలలో

334	10,000 - 23,000
నెం.5	13,500 - 22,500
273	14,800 - 21,000
341	11,000 - 23,000
4884	18,000 - 19,000
సూపర్ 10	19,000 - 22,000
నాన్ ఎసి	
తేజ	9,000 - 24,500
బడిగి	11,500 - 26,000
దేవనూరు డీలక్స్	12,000 - 25,000
తాలుకాయలు	5,000 - 14,000
ఎసి	
334	11,500 - 22,400
నెం.5	16,500 - 16,500
273	13,000 - 13,000
341	12,000 - 21,000
తేజ	10,000 - 24,500
బడిగి	18,000 - 21,000
తాలుకాయలు	6,500 -13,500

హెల్ప్ ఫౌండేషన్ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కంటిపూడి సర్పంచ్ యమున గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.సత్తెనపల్లి మండలం కంటిపూడి గ్రామంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి దంతవైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ యమున ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి పరిస్థితులలో ప్రతి ఒక్కరిని కంటి దంత సమస్యలు బాధిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని మంచి ఆరోగ్యాన్ని కలిగి ఉండాలని అన్నారు. కంటి దంత సమస్యలు ఉన్న 180 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేయడం జరిగింది. ఈ శిబిరంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, చర్చి ఫాదర్ రెవరెండ్ శ్యామ్ కుమార్, డెలిగేట్ రోశయ్య, హెల్ప్ ఫౌండేషన్సభ్యులు వనిత సురేష్ సోమశేఖర్ పాల్గొన్నారు

సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంప్ లో ఉప సర్పంచ్ నిమ్మా విజయ సాగర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా ప్రభుత్వమే అందిస్తోందని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి, ఎంపిడిఒ పి.మాధురి, పంచాయితి కార్యదర్శి నాగరాజు, రాంబాబు, మణి పాల్గొన్నారు.

Notice
O. 38, R-5
IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, TENALI
I.A. No. 749/2023 in O.S.No. 366/2023

Between :
Yadla Sitha Rama Rao ...Petitioner/Plaintiff
And
Nadakuduru Prabhakara Rao ... Respondent/ Defendant

To,
D-1 : Nadakuduru Prabhakara Rao, S/o Dayananda Rao, a/a 44 years, Hindu, Cultivation, R/o D.No. 5-40, Morampudi Village, Duggirala Mandal, Guntur District, Tenali PJCJ. Cell No. 8886444269

The petitioner has filed petition against you in the above matter. If you have got any objection. You may appear before this court on 24-7-2023 at 10-30 AM either in person or through an Advocate and file your objection. If you fail to do so, the matter will be decided exparte.

(By order of the Hon'ble Court)
Nannapaneni Madhava Rao,
Advocate for plaintiff
Cell No. 9493244873

మహారాజశ్రీ నర్సరావుపేట సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఐ.పి. 32/2018
పిటీషనర్ : బొమ్మిశెట్టి శివాంజనేయులు
అండ్
రెస్పాండెంట్లు :
1) గుండా నారాయణరావు అండ్ వగైరాలు
టు
ఆర్-19 : పి.అశోక్, వ్యాపారం, అఖిల్‌సాయి ఏజన్సీస్, డోర్ నెం. 2-4-80/డి, మెడికల్ కాంప్లెక్స్, రాజగారికోట, నర్సరావుపేట టౌన్.
ఆర్-22 : మల్లెబోయిన వెంకటరామయ్య, తండ్రి : యర్రా కోటయ్య, ఆర్/ఓ. ఎడ్వర్డ్‌పేట, రొంపిచర్ల మండలం.

పై నెంబరు ఐ.పి. దావా మీపైన దాఖలు చేసి సదరు ఐ.పి. దావాలో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ మీరు తీసుకోనందున శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం ఈ పేపరు నోటీసు ద్వారా పై కోర్టువారి యెదుట ది. 17-7-2023 తేదీ ఉదయం 10-30 గం.లకు మీరు హాజరయి మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పరోక్షమందు తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదాతేది: 17-7-2023

ఇట్లు
ఎ.అజయ్‌బాబు,
పిటీషనరు తరపు అడ్వకేటు,
వినుకొండ.

Notice
OR 4 R 1 & 5
IN THE COURT OF THE HON'BLE 1 ADDL. JUNIOR CIVIL JUDGE, TENALI
O.S.No. 2/2023

Between :
Narra Avinash ... Plaintiff
And
Nadakuduru Prabhakara Rao ... Defendant

To,
D-1 : Nadakuduru Prabhakara Rao, S/o Dayananda Rao, a/a 44 years, Hindu, Cultivation, R/o D.No. 5-40, Morampudi Village, Duggirala Mandal, Guntur District, Tenali PJCJ. Cell No. 8886444269

Being a suit is filed against you for grant of a judgment and decree in favour of the plaintiff and against the defendant for the suit amount of Rs.8,13,666-00 with future interest on Rs.5,00,000-00 from this date till realization and in order to answer to all the questions raised in the suit, you are hereby ordered to attend the court on 25-07-2023 at 10-30 A.M. and answer and submit your answer, or all relevant documents in person, or through an advocate or through an agent. In case, your failure in attending the court on the above said date, the petition will be enquired and finalized in your absence.

(By order of the Hon'ble Court)
Nannapaneni Madhava Rao,
Advocate for plaintiff
Cell No. 9493244873

బహిరంగ ప్రకటన

నా క్లయింట్స్ అయిన గుంటూరు సిటీ కాపురస్తులు 1) ఈదర అశోక్ కుమార్ తండ్రి.సీతారామయ్య 2) అచ్చ ఉపేందర్ తండ్రి.సోమయ్య 3) బండ్లమూడి శివశంకర్ తండ్రి నాయుడు గార్ల సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా....

మా క్లయింట్స్, గుంటూరు సిటీ, కొరిటెపాడు సబ్.డి, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియాలో చేరిన, గోరంట్ల డి.నెం.532రు మండల రెవెన్యూ అధికారి వారి రికార్డు దాఖలా డి.నెం.532/1రు మింజుమలె 1వ పార్టీ వారలకు హక్కు కలిగిన య.0-58 శెంట్లు భూమిన్నీ, గోరంట్ల గ్రామ డి.నెం.532రు మింజుమలె 2వ పార్టీ వారికి హక్కు కలిగిన య.0-58 శెంట్లు భూమిన్నీ వెరశి ఏకఖండముగా వున్నటువంటి య.1-16 శెంట్లు భూమి హక్కు దారులైన 1వ పార్టీ రాయి సీతారామయ్య గారి భార్య రాయి సామ్రాజ్యం, వారి వారసులైన కుమారులు, కుమార్తె, కోడలు, మనుమలు, మనుమరాళ్ళు మరియు 2వ పార్టీ కాళిశెట్టి సహదేవరావు గారి భార్య అయిన అల్లడి సాంబయ్య గారి కుమార్తె, అల్లడి నాగమల్లేశ్వరి గార్లు, ఇరు పార్టీలు కలిసి ఏకఖండముగా డాక్యుమెంట్ తయారు చేసి, ప్లాట్లుగా విభజించి అమ్మచూపగా మా క్లయింట్స్ సదరు ప్రాపర్టీలోని 3ప్లాట్లను, ఒక్కొక్కరు 177గజాల చొప్పున మొత్తం 531 చ॥గజాలను కొనుగోలు చేయుటకు సిద్ధపడి వున్నారు. సదరు ఆస్థి హక్కు దారులు నిశ్శేషిత ఆస్థిగా తెలుపుతూ సదరు డాక్యుమెంటు చూపించినారు. కావున ఈ ఆస్థిపై ఎవరికైనా, ఎటువంటి అభ్యంతరములు వున్నయెడల, 3 రోజుల లోపు తెలియజేయగలరు. లేని యెడల ఈ ఆస్థిపై ఎటువంటి తగాదాలు లేవని భావించి నా క్లయింట్స్ తమ పేరిట రిజిష్టరు చేసుకోగలరు. తరువాత వచ్చే క్లయిమ్‌లు చెల్లవు. నా క్లయింట్స్ ని బైండ్ చేయజాలవు.

షెడ్యూలు

గుంటూరు డి, కొరిటెపాడు సబ్.డి, గోరంట్ల గ్రామపంచాయతీ గోరంట్ల గ్రామ డి.నెం.532రు మండల రెవెన్యూ రికార్డ్ డి.నెం.532/1రు లోని య.1-16శెంట్లు భూమికి హద్దులు.
తూర్పు:శ్రీ మల్లేశ్వరస్వామి వారి యీనాంభూమి హద్దు,
దక్షిణం:అల్లడి శ్రీరాములు భూమి హద్దు,
పడమర:సర్కారు డొంక,
ఉత్తరం:అల్లడి నారయ్య వగైరాలు భూమి హద్దు.

ఈ హద్దుల మధ్య నున్న య.1-16శెంట్లు భూమిలోని 2, 3, 4 ప్లాట్ల నెంబర్లలోని 531 గజాలు కొనగోలు చేయుటకు ఖరారుపడి యున్నారు.

ఇట్లు
యడ్లపల్లి ప్రసాద్,
అడ్వకేట్,

నేడు మాచర్ల వైస్‌చైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి - మాచర్ల

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక గురువారం ఉదయం జరగనుంది. ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో ఈ ఎన్నిక జరగనున్నట్లు కమిషనర్ ఇవి రమణబాబు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాల ఆర్‌డిఒ ఎన్నికల అధికారిగా, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించనున్నట్లు చెప్పారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇటీవల మున్సిపల్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన బోయ రఘురామిరెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరగనున్నట్లు వివరించారు.

డిజిటల్ విద్యపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల, దాచేపల్లి మండలలోని ఉపాధ్యాయులకు స్థానికంగా ఉన్న న్యూటన్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎంఇఒ నాగయ్య, కళాశాల సెక్రటరీ జె.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ జగదీశ్వరరెడ్డిలు సంయుక్తంగా ఐఎఫ్‌పి (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్) రెండు రోజుల శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు టీచర్లను ఈ శిక్షణ తర్వాత వారి పాఠశాల విద్యార్థులకు ఏ విధంగా బైజుస్ కంటెంట్ ను వీటికి ఆండ్రాయిడ్ బాక్స్ ద్వారా కనెక్ట్ చేసి బోధన చేయాలో, రాష్ట్రంలో జరుగుతున్న నూతన విద్యా విధానంలో మార్పులను టీచర్లకు వివరించారు. కార్యక్రమంలో కోర్స్ కో - ఆర్డినేటర్ వేముల నాగయ్య, పల్నాడు జిల్లా ఎపిఒ యస్.రఫి దాచేపల్లి, మాచర్ల మండలంలోని సుమారు 170 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అ'పూర్వ'విద్యార్థి సాయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తాము చదువుకున్న కళాశాలను మరువకుండా ఎంతో కొంత చేతనైనంత సాయం చేయాలనే సంకల్పంతో పట్టణ వాసి, పూర్వ విద్యార్థి శేషు కుమార్ ముందుకొచ్చారు. ప్రస్తుతం పుర్వ్యా లైఫ్ సైన్సు ఫార్మా స్యూటికల్స్ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్ గా ఆయన వ్యవహరిస్తున్నారు. స్థానిక పల్నాడు రోడ్డులోని ఎస్.ఎస్.ఎన్ కళాశాల పూర్వ విద్యార్థి కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.16 లక్షలు వితరణ చేశారు. కళాశాల యాజమాన్యానికి నగదు అందజేశారు. నరసరావుపేట పట్టణానికి చెందిన శేషుకుమార్ ఎస్.ఎస్.సి అనంతరం 1985-90 వరకు ఇంటర్మీడియట్, డిగ్రీ (ఎంఎస్‌సి కెమిస్ట్రీ) విద్యాభ్యాసం పూర్తి చేశారు. శేషు చదువుకునే రోజుల్లో కూడా పేద విద్యార్థులకు సాయ పడేవారు. వారసత్వంలో భాగంగా ఎస్‌ఎస్ ఎన్ కళాశాల కమిటీ మెంబర్‌గా ఆయనకు అవకాశం లభించింది. ఈ సందర్భంగా శేషు కుమార్ మాట్లాడుతూ ప్రతి యేట కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి తన వంతు సహకారం అందించానన్నారు. ఈ కళాశాలలో బిఎస్సి చివరి ఏడాది పూర్తి చేసుకున్న 30 మంది ప్రతిభ విద్యార్థులకు హైదరాబాద్ లో స్థాపించిన పుర్వ్యా లైఫ్ సైన్సు ఫార్మా స్యూటికల్స్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. తాను పారిశ్రామిక వేత్తగా ఎదిగేందుకు కళాశాల జీవితం దోహదం చేసిందన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు

కనీస వేతనాలివ్వండి

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

ఇరవై నుండి మధ్యాహ్నం భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని తదితర సమస్యలు పరిష్కారం కోసం డిమాండ్ చేస్తూ ఈ నెల 31న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాలో మధ్యాహ్నం భోజన కార్మికుఅధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మధ్యాహ్నం భోజన కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివ కుమారి అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూ ల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ కుమారి మాట్లాడుతూ మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు, పథకానికి బడ్జెట్ పెంచాలని మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలని సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలన్నారు. పథకాన్ని

వినుకొండలో మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని మౌలిక సదుపాయాలు మంచినీరు వంటగది వంట పాత్రలు ప్రభుత్వమే ఇవ్వాలని ఏడాదికి రెండు జతలు యూనిఫామ్ మధ్యాహ్న భోజన కార్మికులకు ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఈ నెల 30న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో మధ్యాహ్నం భోజన కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. మధ్యాహ్న భోజన

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్నం భోజన కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి తదితరులు

కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాగిజావ తయారు చేయడానికి వంట పాత్రలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

పెరుగుతున్న నిత్యావసర సరుకులు, వంట గ్యాస్ ధరల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం పథకం ద్వారా నాణ్యమైన భోజనాన్ని అందించడం కష్టతరంగా మారిందని సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు అంగలకుదురు ఆంజనేయులు, తిరుమల లక్ష్మీలు అన్నారు. మండల విద్యాశాఖ అధికారి జాఫ్రుల్లా కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు కనీస వేతనం 10వేలు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న బిల్లులు జీతాలు వెంటనే చెల్లించాలని, ప్రతినెల 5వ తేదీ లోపుగా వేతనాలు అందజేయాలని అన్నారు. నాణ్యమైన బియ్యం, సరుకులు సివిల్ సప్లైస్ ద్వారా సప్లై చేయాలని కోరారు. బీమా సౌకర్యాన్ని కల్పించాలని, గుర్తింపు కార్డులు, ఉద్యోగ భద్రత ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.కె రంజాన్ బి, ఎస్ పద్మ, సిఐటియు నాయకులు బి వెంకటేశ్వర్లు, ఎస్ కె నాసర్ బి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అదనపు జిల్లా వైద్య వైద్య ఆరోగ్యశాఖ అధికారి వినతి పత్రం ఇస్తున్న ఆశా కార్యకర్తలు, నాయకులు

'ఆశా'లపై రాజకీయ వేధింపులు ఆపండి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 18న చేపట్టనున్న ధర్నా జయప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివ కుమారి పిలుపునిచ్చారు. ఈ మేరకు ధర్నాకు సంబంధించి వినతి పత్రాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె. పద్మావతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక ఆశా, అంగన్వాడీ తదితర వ్యవస్థలలో రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. ఆశా వర్కర్స్ కు తాము పని చేసే విభాగాలకు ఎటువంటి సంబంధం లేని పనులు చేయిస్తున్నారన్నారు. ఆన్లైన్లో వర్క్ కు సంబంధించిన శిక్షణ, సమర్థవంతంగా పని చేసే ఫోన్లు ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, యాప్ లు సరిగ్గా పని చేయకపోవడం వలన వారు మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆన్లైన్ పని భారం తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ సెలవులు, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆన్లైన్ వర్క్ ల పేరుతో జరుగుతున్న వేధింపులు,బెదిరింపులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. రికార్డులు రాయాలని జారీ చేయడం తగదు అన్నారు. సెల్ ఫోన్స్ పనిచేయకపోతే చేతి నుండి డబ్బు పెట్టి సెల్ఫోన్ కొనుగోలు చేసి పని చేయాలని వేధిస్తున్నారన్నారు. 26 రకాల రికార్డులు కూడా సొంత డబ్బులతో రికార్డులు కొనుగోలు చేయాలంటున్నారని, విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.చంద్రకళ, ఆశాలు ధనలక్ష్మీ, అనూరాధ, కనకరత్నం పాల్గొన్నారు.

సమస్యలపై పారిశుధ్య కార్మికుల ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని పారిశుధ్య కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో బంగ్లా సెంటర్ నుండి గురజాల నియోజకవర్గ శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి ఆఫీస్ వరకు బుధవారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఫణీంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్ హాజరై మాట్లాడుతూ ఏళ్ల తరబడి పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయకుండా అరకొర వేతనాలతో వెట్టి చాకిరి చేయించడం సబబు కాదన్నారు. కరోనా సమయంలో వారి సేవలను కొనియాడి, వారి కాళ్లను కడిగిన ప్రధాని నరేంద్ర మోడీ, వారికి ఎలాంటి ఆర్థిక సహాయం చేయలేదని విమర్శించారు. చనిపోయిన కార్మికులకు ఎలాంటి పరిహారం అందలేదని అన్నారు. తాను అధికారంలోకి వస్తే పారిశుధ్య కార్మికులందరినీ క్రమబద్ధీకరిస్తానని నాడు జగన్ హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లు దాటుతున్నా దాని ఊసే లేదని అన్నారు. పారిశుధ్య కార్మికులకు నష్టం చేసే ఆప్కాస్ సంస్థను తీసుకురావడం వల్ల ప్రభుత్వం నుండి రావాల్సిన ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని అన్నారు. పారిశుధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సబ్బులు, నూనెలు, యూనిఫామ్ వెంటనే ఇవ్వాలని, ఎన్.ఎం.ఆర్ ఇంజనీరింగ్ విభాగ కార్మికులకు పారిశుద్ధ కార్మికులతో అలవెన్స్‌తో కూడిన వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, కరోనా సమయంలో తీసుకున్న కార్మికులను పారిశుధ్య కార్మికుల్లో విలీనం చేయాలని, వీటిని వెంటనే అమలు చేయని పక్షంలో దశలవారీగా ఆంధ్రాలో ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మల్లయ్య, సిఐటియు మండల కార్యదర్శి కె.శ్రీనివాసరావు, పారిశుద్ధ కార్మికులు కె.సీతారామయ్య, బి.రామారావు,ఎం. నాగయ్య, గురవయ్య,వెంకయ్య,శ్యాంకోటి,పద్మ,మార్తమ,వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్

జాతీయ అభివృద్ధిలో యువత పాత్ర పై సదస్సు

ప్రజాశక్తి - క్రోసూరు

మండల కేంద్రమైన క్రోసూరులోని జై భారత్ స్కూల్ లో బుధవారం విద్యార్థులకు జాతీయాభివదిలో యువత పాత్ర పై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జై భారత్ విద్య సంస్థల డైరెక్టర్ తిప్పిరెడ్డి జైనేంద్రరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ముంబయి బాబా అటామిక్ సెంటర్ రిటైర్డ్ శాస్త్రవేత్త అచ్యుత రామారావు పాల్గొన్నారు. పోక్రాన్ న్యూక్లియర్ టెస్ట్ విజయవంతంగా ప్రయోగించిన శాస్త్రవేత్తలలో ఒకరైన అచ్యుత రామారావు డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం చేతుల మీదుగా 1998 సంవత్సరం లో అవార్డు కూడా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశాభివృద్ధిలో భాగస్వాములై తమ శక్తియుక్తులతో నవ, ఆత్మనిర్భర భారత నిర్మాణం కోసం కృషి చేయాలని పిలుపనిచ్చారు. విద్యార్థులు ప్రతికూల ఆలోచనలను పక్కనపెట్టి సానుకూల దృక్పథంతో ముందుకెళ్తే సాధించలేనిది ఏదీ ఉండదని దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు అన్నిరంగాల్లో తమ శక్తియుక్తులను వెచ్చించి, దేశాభివద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులు వినూత్న, సృజనాత్మకమైన ఆలోచనలతో ముందుకురావాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థుల సందేహాలను నివృతి చేశారు. అనంతరం అచ్యుత రామారావును విద్యా సంస్థల డైరెక్టర్ జైనేంద్రరెడ్డి ఘనంగా సన్మానించారు.

మాట్లాడుతున్న అచ్యుత రామారావు

స్థానికంగానే పట్టాల కోసం రాయభారం

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని వెంకయ్య కొట్టు సెంటర్, సలాం హోటల్ సెంటర్, కొత్త వడ్డెరకాలనీ, పోతురాజుస్వామి గుడి, ముగ్గురోడ్డు, లంబాడీపేటకు చెందిన పేదలు తాము నివాసం ఉంటున్న ఇళ్లకు పట్టాలిచ్చి ఇక్కడే నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సచివాలయం అధికారులకు బుధవారం అర్జీలు అందజేసి, రాయభారం నిర్వహించారు. రెండ్రోజుల నుంచి ఈ ప్రాంతంలో సిపిఎం కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రజల స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం ఇక్కడ నివాసం ఉంటున్న ప్రజలకు రాజధానిలో సెంటు చొప్పున భూమి కేటాయించింది. దీని పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంత దూరం వెళ్లి తాము నివాసం ఉండలేమని చెబుతున్నారు. కోర్టు వివాదాల్లో ఉన్న ఆ స్థలం ఇచ్చే కంటే ప్రభుత్వం ఇప్పుడు నివాసం ఉంటున్న స్థలాలకే పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలాల దగ్గరకు వెళ్తే అక్కడ ఉన్న రైతులతో కొంత వివాదం నడిచిందని చెబుతున్నారు. ఆ మేరకు బుధవారం సచివాలయంలో సామూహిక అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎస్.ముత్యాలరావు అధ్యక్షతన సచివాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు వేముల దుర్గారావు మాట్లాడారు. 6, 14 వార్డుల సచివాలయాల పరిధిలో రైల్వే స్థలాల్లో నివసిస్తున్న పేదలందరికీ అక్కడే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలంలో 13 ఏళ్లుగా నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తే దాని మీద లబ్ధిదారుడికి శాశ్వత హక్కు వస్తుందని చెప్పారు. ఈ చట్టాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నీరుగారుస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై మాట్లాడకపోవడం శోచనీయమని విమర్శించారు. అంగన్‌వాడీల పోరాట స్ఫూర్తితో ఇళ్ల లబ్దిదారులు పోరడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.కరుణాకరరావు, జి.సుబ్బారెడ్డి, టి.బాబూరావు, డి.విజయ్‌బాబు, డి.శంకరరావు, ఎస్‌కె సుబానీ, ఫిరోజ్, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

ఇక్కడే ఉంటాం : బుర్ర సంసోన్, ముగ్గురోడ్డు

మా తాత తండ్రుల నుంచి నివాసం ఉంటున్నాం. ఇక్కడే నివాసం ఉంటాం. రాజధానిలో ఇటీవల ఇచ్చిన ప్లాట్లు కోర్టు తీర్పులకు లోబడి ఉండాలని నిర్దేశించారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలో స్పష్టంగా పేర్కొన్నారు. అక్కడకు వెళ్తే మౌలిక సౌకర్యాలు లేవు. పిల్లలకు చదువులు దూరమవుతాయి. పని చేసుకుంటేనే పూట గడిచేది. అక్కడకు వెళ్తే పని ప్రాంతాలు దూరమవుతాయి. ఇప్పుడు ఉంటున్న ఇళ్లకే పట్టాలివ్వాలి.

ఫేక్ మెడికల్ సర్టిఫికెట్‌తో సెలవులోకి టైపిస్ట్

ఛార్జిమెమో జారీ చేసిన నగర కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరపాలక సంస్థలో విధులు నిర్వహించే ఉద్యోగులు అంకిత భావం, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని, కేటాయించిన విధుల్లో నిర్లక్ష్య వైఖరి కనబరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జిఎంసిలో టైపిస్ట్‌గా విధులు నిర్వహిస్తూ, గత నెలలో రెవెన్యూ విభాగంలో ఎ2గా కేటాయించిన భాధ్యతలు స్వీకరించకుండా, అధికారుల అనుమతి లేకుండా ఎల్.శ్రీదేవి ఫేక్ మెడికల్ సర్టిఫికెట్‌తో దీర్ఘకాల సెలవులో వెళ్లారని తెలిపారు. కేటాయించిన భాధ్యతలు తీసుకుకోకపోవడం, ఉన్నత అధికారులకు ఎటువంటి సమాచారం అందించకపోవడం వలన నగరపాలక సంస్థ ఆదాయ వనరులకు భంగం వాటిల్లిందని పేర్కొన్నారు. నగరంలో గడవు ముగిసిన ఆసీలు రెన్యువల్ జాప్యం అవ్వడంపై ఇటీవల జరిగిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో కూడా చర్చకు వచ్చిందని, ఇందుకు కారణమైన శ్రీదేవి వ్యవహారశైలిపై అదనపు కమిషనర్‌ని విచారణకు ఆదేశించి, సదరు మెడికల్ సర్టిఫికెట్లను తనిఖీ నిమిత్తం మెడికల్ బోర్డుకు పంపామని తెలిపారు. ఆ రిపోర్టును మెడికల్ బోర్డు పరిశీలించి ఫేక్ అని నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. కార్యాలయాన్ని తప్పుదోవ పట్టించిన శ్రీదేవిపై ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీస్ రూల్స్–1991 ప్రకారం క్రమశిక్షణా చర్యల్లో భాగంగా చార్జిమెమో జారీ చేశామని, 10 రోజుల్లో రాత పూర్వక సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

చిత్ర కళాకారుడు మధుసూదన్‌కు మేయర్ అభినందన

మధుసూదన్‌ను అభినందిస్తున్న మేయర్

ప్రజాశక్తి-గుంటూరు

చిత్ర కళాకారుడు మధుసూదన్‌ను నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అభినందించారు. ఈనెల 9వ తేదీన హైదరాబాద్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో కళాకారులకు నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో 'మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' పేరు నమోదు చేయటమే కాక 'శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ అవార్డు అందుకున్న సందర్భంగా మధుసూదన్ మేయర్‌ను సంపత్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మేయర్ మదుసూదన్‌ను అభినందించారు. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్ర తెలంగాణలలో మధుసూదన్ 'మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' లో స్థానం సంపాదించిన మొదటి వ్యక్తి అన్నారు. 25 ఏళ్లుగా చిత్ర కాళాకారునిగా అన్ని వయస్సుల వారికీ శిక్షణిస్తూ, ఎంతో మంది చిత్ర కళాకారులను తయారు చేశారని, ఆయనకు ఎన్నో అవార్డులు వచ్చాయని చెప్పారు. అటువంటి కళాకారుడు గుంటూరుకు చెందిన వ్యక్తి అవటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఇంకా మంచి చిత్రాలు వేసి ఆర్టిస్ట్‌గా ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

జెవికె కిట్లను త్వరగా అందించండి

రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఒ-2 శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పట్టణంలోని ఇటుకంపాడు రోడ్‌లో ఉన్న మదర్సా మిహబూబియా పాఠశాలను ఎంఇఒ-2 శ్రీనివాసరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల రిజిస్టర్లు, డ్రాపౌట్స్ రిజిస్టర్లు పరిశీలించారు. తదనంతరం పాఠశాల మౌలిక వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. జెవికె కిట్లను విద్యార్థులకు త్వరితగతన అందించాలని ఆదేశించారు. ఆయనవెంట సిఆర్‌పి జయంతి, ముఫ్తీ అబ్దుల్లా, ఖయ్యూం ఉన్నారు.

మణిపాల్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు

ప్రారంభించిన రాష్ట్ర ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు

ప్రారంభిస్తున్న ఎం.టి.కృష్ణబాబు

ప్రజాశక్తి-తాడేపల్లి

అతి ప్రమాదకరమైన వ్యాధులకు సంబంధించి ముందస్తు లక్షణాలను గుర్తించడం కోసం మణిపాల్ ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలతో కూడిన అత్యాధునిక ఇమేజింగ్ సిస్టమ్‌ను తీసుకురావడం ఈ ప్రాంత రోగులకు వరప్రసాదమని రాష్ట్ర ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు అన్నారు. స్థానిక మణిపాల్ ఆసుపత్రిలో డిజిటల్ త్రిడి మమోగ్రఫీ కోసం అత్యాధునిక ఇమేజింగ్ సిస్టమ్‌తో కూడిన పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ (పిఇటి–సిటి) సిటీ స్కాన్ సెంటర్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపాల్ ఆసుపత్రి రాష్ట్రంలోనే అత్యంత నాణ్యమైన వైద్య సేవలు అందిస్తోందని అభినందనలు తెలిపారు. వైద్య సేవల్లో ముందుపీఠిన ఉన్న మణిపాల్‌ను విజయవాడ నగరంతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైద్య నిపుణులు (పిఇటి–సిటి) సిటీ స్కాన్‌లు రోగి శరీరం లోపల ఉన్న కణితి యొక్క కచ్చితమైన పరిణామాన్ని, అది శరీరంలో ఎక్కడ ఉందో చూపుతుందని చెప్పారు. వ్యాధి గురించి వైద్యులకు మంచి అవగాహన కల్పించడంలో ఈ మిషన్ ఉపయోగపడుతుందని, దీనివల్ల వైద్యులు గతం కంటే మెరుగ్గా వ్యాధులను గుర్తించడంతో పాటు వెంటనే నిర్ధారించడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ఈ విధానం వల్ల రోగికి చికిత్స సమయంతో ఖర్చు తగ్గుతుందన్నారు. మణిపాల్ ఆసుపత్రుల్లో అన్ని రకాల అత్యవసర వైద్య సహాయం కోసం శిక్షణ పొందిన పారా మెడిక్స్‌తో పాటు నిపుణులైన వైద్యులు పని చేస్తున్నారని అన్నారు. పిఇటి సిటీ స్కాన్ ద్వారా కేన్సర్, మెదడు రుగ్మతలు, గుండె జబ్బులు ముందస్తుగా గుర్తించవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో కన్సల్‌టెంట్ మెడికల్ అంకాలజిస్టు, బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి, మణిపాల్ ట్రూ టెస్ట్ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ నీరజ్ అరోరా, సీనియర్ రేడియాలజిస్టు డాక్టర్ సతీష్‌బాబు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సాంబిరెడ్డి తదితరులు

విశ్రాంత పోస్టల్ ఉద్యోగి బసివిరెడ్డికి సిపిఎం నాయకుల నివాళి

ప్రజాశక్తి-తెనాలి

విశ్రాంత పోస్ట్ మాస్టర్ ఆరెమండ బసివిరెడ్డి (80)కి సిపిఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, నాయకులు కె.చంద్రశేఖర్ నివాళులర్పించారు. కొల్లిపర మండలం ప్రజాశక్తి విలేకరిగా పనిచేస్తున్న ఆరెమండ శ్రీనివాసరెడ్డి తండ్రి బసివిరెడ్డి పోస్ట్‌మాస్టర్‌గా తాడేపల్లి, పలు ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం రాత్రి మృతి చెందారు. అంత్యక్రియలు బుధవారం కొల్లిపరలో నిర్వహించారు.

మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఆర్కె, హనుమంతరావు, చిరంజీవి

కూరగాయల మార్కెట్ ఆధునీకరణకు చర్యలు

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని టిడ్కో గృహ సముదాయం సమీపంలోని కూరగాయల మార్కెట్‌ను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. ఇక్కడున్న షెడ్లు పూర్తిగా దెబ్బ తిన్న దృష్ట్యా నూతనంగా నిర్మిస్తామని చెప్పారు. శాశ్వత మార్కెట్ నిర్మాణానికి పరిశీలిస్తున్నామన్నారు. ఆయనవెంట ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వైసిపి చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు ఎం.మల్లేశ్వరరావు ఉన్నారు.

వాటర్ పైప్‌లైన్ ట్రయల్ రన్

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని రన్నింగ్ రూమ్ సెంటర్‌లో పైప్‌లైన్ ట్రయల్ రన్ బుధవారం నిర్వహించారు. ఇటీవల ఈ ప్రాంతంలో తాగునీరు సక్రమంగా రావడంలేదు. పబ్లిక్ ట్యాపుల ద్వారా మంచినీటి సరఫరాను మెరుగుపరిచి ప్రజలకు తాగునీరు అందించాలని సిపిఎం నాయకులు ఈ ప్రాంతంలో పర్యటించి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సచివాలయంలో అధికారులకు అర్జీలు అందజేశారు. వారం క్రితం డిప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి ఇక్కడ పర్యటించి నూతనంగా పైపులైన్ ఏర్పాటు చేయించారు. పైపులైన్లలో ఉన్న మురికి నీరు పోవడానికి బుధవారం ఇంజనీరింగ్ సిబ్బంది ట్రయల్ రన్ నిర్వహించారు. పనులు పూర్తి చేయడానికి మరో 15 రోజులు పడుతుందని సిబ్బంది చెబుతున్నారు. మరో నాలుగు రోజులు ట్రయల్ రన్ నిర్వహించాలంటున్నారు. మెయిన్ లైన్ కనెక్షన్ ఇచ్చే పని కూడా త్వరలోనే పూర్తి చేసి నీరు సరఫరా చేస్తామని సిబ్బంది చెబుతున్నారు.

భూ యజమానులు కౌలు రైతులకు సహకరించాలి

- జిల్లాలో 25 వేల సిసిఆర్‌సి కార్డులు, 8 వేల పిఎం కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు
- 45 శాతం జగనన్న సురక్ష పూర్తి
- జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

ప్రజాశక్తి - వినుకొండ

కౌలు రైతు గుర్తింపు కార్డుల మంజూరుకు భూ యజమానులు కౌలు రైతులకు సహకరించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ కోరారు. జగనన్న సురక్ష లో భాగంగా బుధవారం వినుకొండకు వచ్చిన ఆయన మండలంలోని ఏనుగుపాలెం సచివాలయాన్ని సందర్శించి జగనన్న సురక్ష ద్వారా మంజూరైన 29 మంది కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు అందజేశారు. అలాగే కంది పంట సాగుచేసే రైతులకు ఉచితంగా విత్తనాలు అందజేశారు. అనంతరం వినుకొండ తహాశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జగనన్న సురక్ష ఇంటింటి సర్వే పల్నాడు జిల్లాలో 90 శాతం పూర్తి చేశామని 11 రకాల సర్టిఫికెట్ల ఉచిత మంజూరులో సురక్ష ద్వారా 45 శాతం పూర్తి అయిందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా నివేశనా గృహాలు, స్థలాలు లాంటి సమస్యలను పరిగణనలోకి తీసుకొని 20 రోజుల్లో పరిష్కరించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు భూమి సాగు విస్తీర్ణం మూడు లక్షల ఎకరాలకు పైగా ఉందని ప్రతి రైతు పంట ఈ-క్రాప్ చేసుకోవాలని కోరారు. భూ యజమానులు కౌలు రైతులకు ఇవ్వడం వలన ఎటువంటి ఇబ్బందులు లేవని దీనిపై గ్రామాల్లో రైతులకు రెవెన్యూ అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. భూమి కౌలుకు తీసుకున్న వారికి భూ యజమాని ఫామ్-1 పై అనుమతి సంతకం చేయాలని తెలిపారు. జిల్లాలో 55 వేల సిసిఆర్సి కార్డుల మంజూరు లక్ష్యంగా పనిచేస్తున్నామని ఇప్పటికీ 25,000 కౌలు రైతు కార్డులు ఇచ్చినట్లు తెలిపారు. లక్ష కౌలు రైతు కార్డు ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. సిసిఆర్సి కార్డు పొందడం వలన కౌలు రైతులకు ఆర్థికల నుండి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని రైతు భరోసా 13,500 తోపాటు పంట నష్టపోతే పరిహారం కూడా వస్తుందని ఎందుకు భూ యజమానులు సహకరించాల్సిందిగా కోరారు. భూ యజమానులు అందుబాటులో లేకపోయినా వీడియో రికార్డింగ్, మెయిల్ ద్వారా కూడా వారి అనుమతిని తెలిపితే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి కిసాన్ క్రెడిట్ కార్డులు జిల్లాలో 8వేల మంది లబ్ధిదారులకు ఇవ్వడం జరిగిందని, వారిలో 2వేల మంది గొర్రెలు మేకల పెంపకం దారులు కాగా, 6వేల మంది గేదెల పెంపకం దారులు ఉన్నట్లు తెలిపారు.జిల్లాలో 28 మండలాల్లో 80 గ్రామాల్లో రీ సర్వే జరుగుతోందని, 20 గ్రామాల్లో పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 3.25 లక్షల ఎకరాలకు 2.75 లక్షల ఎకరాల రీ సర్వే జరిగిందని ఆగస్టు 31 లోపు పూర్తి చేసి సెప్టెంబర్ 30 కి హద్దురాళ్ళు వేసి, అక్టోబర్ మాసంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు



కౌలు రైతుకు సిసిఆర్సీకార్డు అందజేస్తున్న జెసి శ్యాంప్రసాద్

ముఖ్యమంత్రి చేతుల మీదగా రైతులకు అనుమతి పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. శావల్యాపురం, ఈపూరు, నూజెండ్ల మండలాల్లో జగనన్న సురక్ష పథకం నిర్వహణను పరిశీలించారు. స్పెషలాఫీసర్ శ్రీరాములు రెడ్డి, తహాశీల్దార్ కిరణ్ కుమార్ రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డుల ప్రక్రియ వేగవంతం చేయండి

ప్రజాశక్తి-ఈపూరు

కౌలు కార్డుల ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసి కౌలు కార్డులు రైతులకు అందజేయాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ అన్నారు. స్థానిక తహఖీషల్దార్ కార్యాలయంలో భూ రి సర్వే, కౌలు రైతు కార్డుల పనులపై ఆరా తీశారు. భూ రీ సర్వే పనులలో కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అలాగే మండలంలో 2000 మంది రైతులకు కౌలు కార్డులు అందించేడమే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు.

బాధ్యతలు స్వీకరించిన ఈపూరు ఎస్ఐ

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు ఎస్సైగా షేక్ మహమ్మద్ ఫిరోజ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. చిలకలూరిపేట పట్టణ ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై ఈపూరు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి గొడవలకు తావు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఉండాలన్నారు. శాంతి,భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు.

ఎమ్మెల్సీ రాజశేఖర్ పరామర్శ

ప్రజాశక్తి-నాదెండ్ల

నాదెండ్ల మండలం అమీన్ సాయబ్ పాలెం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు గుర్రం ఉపేంద్ర తల్లి అనంత రాములమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సి మర్రి రాజశేఖర్ వారి కుటుంబాన్ని బుధవారం పరా మర్శించారు. వారి నివాసానికి వెళ్లి అనంత రాములమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. రాజశేఖర్ వెంట పార్టీ నాయకులు కంజుల వీరారెడ్డి ,గంటా మురళి ,కోటిరెడ్డి పాల్గొన్నారు.

'శిలాఫలకాన్ని ఎందుకు తొలగించారు?'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

శిలాఫలకం తొలగింపు పై ఆందోళన చేసిన టిడిపి నేతలు. సత్తెనపల్లి తహసిల్దార్ కార్యాలయం నూతన భవనానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం తొలగింపు పై టిడిపి నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా టిడిపి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ పెదకరిముల్లా మాట్లాడుతూ రూ.60లక్షలతో సత్తెనపల్లి తహశీల్దార్ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి అప్పటి సభాపతి కోడెల శివప్రసాదరావు 2017లో భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. 80శాతం పనులు పూర్తి అయ్యాయనీ అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాలుగా నిర్మాణం పై మంత్రి అంబటి రాంబాబు దృష్టి సారించలేదని అన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో భవనాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఈ నేపథ్యంలో శిలాఫలకాన్ని తొలగించారని అన్నారు. ఎందుకు శిలాఫలకం దిమ్మె ను తొలగించారని తహశీల్దార్‌ను టిడిపి నాయకులు ప్రశ్నించారు. భవన నిర్మాణానికి అడ్డంగా వుండటంతో పక్కన పెట్టామని తరువాత శిలాఫలకం ఏర్పాటు చేస్తామని నాయకులకు వివరించారు. దీంతో, టిడిపి నేతలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ నాయకులు దివ్వెల శ్రీనివాసరావు, మండల తెలుగు యువత నాయకులు నలజాల కృష్ణ ప్రసాద్ నాయకులు మస్తాన్ వలీ పున్నయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు

పేద విద్యార్థికి లాప్‌టాప్ వితరణ

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థినికి షేక్ రేష్మ టిడిపి ఆధ్వర్యంలో బుధవారం లాప్‌టాప్ అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సూచన, సహకారంతో నియోజకవర్గ తెలుగు యువత నాయకులు లింగంగుంట్ల కు చెందిన ఎం.సౌమిత్, పెదకూరపాడు మండల టీడీపీ అధ్యక్షులు ఎ.రమేష్, నరసరావుపేట పార్లమెంట్ డాక్టర్ సెల్ కార్యదర్శి జి.చిన్నరాజు, త్రిశక్తి పీఠం ఆలయ శాశ్వత ధర్మకర్త పొట్టి నాగమల్లేశ్వరరావులు లాప్‌టాప్ సమకూర్చారు.

ఓటరు జాబితాలో అవకతవకలను అరికట్టండి

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

డబల్ ఎంట్రీలను, దొంగ ఓట్లు, చనిపోయిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని ఓటర్లు జాబితాలు సరి చేయకుంటే ఆందోళన చేస్తామని టిడిపి నాయకులు అన్నారు. నరసరావుపేట పట్టణంలో ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో,ఎమ్మార్వో,మున్సిపల్ కమిషనర్ ప్రభుత్వ ఉన్నతాధికారులతో బుధవారం టిడిపి నాయకులు భేటీ అయ్యారు. ఓటర్ లిస్టులోని అవకతవకలు అరికట్టాలని డబుల్ ఎంట్రీలు,చనిపోయిన వారి ఓట్లు,ఒకే డోర్ నెంబర్ తో ఉన్న అనేక ఓట్లను గుర్తించి వాటి వివరాలను డోర్ నెంబర్,పోలింగ్ బూత్ నెంబర్లతో సహ అధికారులకు అందజేసి అనర్హులను ఓటర్ల జాబితా నుంచి తీసివేయాలని కోరారు.నకిలీ ఓట్లతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే వారి పై కఠిన చర్యలు తీసుకొని

ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్ లకు వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

భవిష్యత్తులో ఇలాంటి తప్పు ఎవరు చేయకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నరసరావుపేట మండల అధ్యక్షులు బండారుపల్లి విశ్వేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు శేఖర్, పల్లెల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షేడ్‌నెట్లను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారులు

లైసెన్స్ లేని షేడ్‌నెట్లపై చర్యలు

ప్రజాశక్తి-ఈపూరు

లైసెన్స్ లేని షెడ్ నెట్ లపై కఠిన చర్యలు ఉంటాయని ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్ కుమార్ అన్నారు. మండలంలోని వనికుంట,ఈపూరు, ముప్పాళ్ళ, ఇనిమెళ్ళ గ్రామాలలో మిరప నారు పెంచుతున్న నర్సరీలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ నర్సరీల యజమానులు రికార్డులలో వివరాలు నమోదు చేయాలన్నారు. విత్తనాలు ఇచ్చిన రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. నాణ్యమైన నారును రైతులకు అందించాలని లేనియెడల శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల నుంచి విత్తనాలు తీసుకునే సమయంలో తప్పనిసరిగా బిల్లును పరిశీలించి విత్తనాలను తీసుకోవాలన్నారు. నారు పెంచే సమయంలో తీసుకోవాల్సిన మెలుకువలు, సస్యరక్షణ చర్యలు, ముందస్తు జాగ్రత్తలపై నర్సరీ నిర్వాహకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఉచితంగా ఉపకరణాలు

15న లబ్ధిదారుల ఎంపిక

ప్రజాశక్తి - మాచర్ల

రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా అందించే సహాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఓ కోటేశ్వరరావు తెలిపారు. మాచర్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల వారికి ఈ నెల 15వ తేదీన ఉదయం 10 గంటలకు మాచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. క్యాంప్‌లో లబ్దిదారుల నుండి దరఖాస్తులు తీసుకోనున్నట్లు తెలిపారు. 40శాతం అంగ వైకల్యం ఉన్న వారు, తెల్ల రేషన్ కార్డు కలవారు, ఆధార్ కార్డు, 2 పాస్‌పోర్టు ఫోటోలతో క్యాంప్‌కు హాజరు కావాలన్నారు. వికలాంగులకు చేతికర్రలు, చంకకర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిలు తదితర వారికి అవసరమైన ఉపకరణాలను అందించేందుకు క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ కోటేశ్వరరావు వివరించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

నరసరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది నుండి తరగతులు ప్రారంభం

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో నరసరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన హనుమయ్య మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మూడు జిల్లాల ఆర్.జెడి జోష్న, నరసరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హనుమయ్య మరియు వైస్ ప్రిన్సిపాల్ అధ్యాపకులు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ లింగం గుంటలోని శంకర భారతిపురంలో జిల్లా పరిషత్ హైస్కూల్ లో ప్రత్యేక విభాగంలో ఇంటర్మీడియట్ కోఎడ్యుకేషన్ 2023-2024 ప్రభుత్వం ఆమోదించగా, పల్నాడు రోడ్ లోనే జేఎన్టీయూ-కే యూనివర్సిటీలో ప్రత్యేక విభాగంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 2023-2024 వెబ్ కౌన్సిలింగ్ ఆన్లైన్ ద్వారా కూడా రావడం జరిగిందన్నారు. నరసరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఈ ఏడాది నుండి తరగతులు ప్రారంభం కానున్నాయన్నారు .పీ.జీ తరగతులు కోసం ముఖ్యమంత్రి ఆమోదం కోసం సిద్ధంగా ఉందన్నారు.

గురుకుల పాఠశాలలో మిగిలిన సీటకు అడ్మిషన్లు

ప్రజాశక్తి-అమరావతి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల వివిధ తరగతులకు అడ్మిషన్ల ప్రక్రియను బుధవారం డిసిఒ పద్మజ, ఇందిరా ప్రియదర్శినిలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిఒ పద్మజ 15 బాలికల గురుకుల పాఠశాలకు మిగిలిపోయిన వివిధ తరగతుల అడ్మిషన్లు బుధవారం పూర్తి చేశామని 5వ తరగతి ప్రవేశానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని ఆమె అన్నారు. వివిధ పాఠశాలల ప్రిన్సిపల్స్, టీచర్స్, ఆఫీస్ సిబ్బంది, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లి దరఖాస్తులు తీసుకోవాలి

వర్చువల్‌గా సమీక్షిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన అన్ని ప్రభుత్వ సేవల దరఖాస్తులను సక్రమంగా సేకరించి, నిర్దేశిత సమయంలోగా పరిష్కరించేలా మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సబ్ కలెక్టర్, ఆర్డిఓ, ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలక్టరేట్ నుండి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో కలసి బుధవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రత్యేకాధికారులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం జగనన్న సురక్ష క్యాంప్ దేకు వారం ముందు నుంచే సంబంధిత సచివాలయ పరిధిలో వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవల దరఖాస్తులను సేకరించి యాప్‌లో టోకెన్లు జనరేట్ చేసేలా క్షేత్రస్థాయి అధికారులతో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పేదలందరికి ఇళ్ల పథకం లే ఔట్లలో జూలై 31 నాటికి నిర్దేశించిన లక్ష్యాలు కచ్చితంగా అధిగమించాలన్నారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించేలా విద్యుత్ శాఖ, ఆర్ డబ్ల్యూఎస్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో డ్రాప్‌ఔట్స్ అయిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ఎంఇఒలతో పాటు, ఎంపిడిఒలు, ప్రత్యేక అధికారులు, ఎడ్యుకేషన్ సెక్రెటరీలను, వాలంటీర్లను సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024కు సంబంధించి ఎన్నికల కమిషన్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం డోర్ టు డోర్ ఓటరు కార్డుల వెరిఫికేషన్ సక్రమంగా జరిగేలా ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు బిఎల్ఓలతో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఉపాధి హామీ కింద జాబ్‌కార్డ్ పొందిన విభిన్న ప్రతిభావంతులకు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం కచ్చితంగా పని కల్పించాలన్నారు. జేసీ మాట్లాడుతూ గుర్తించిన కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులను జగనన్న సురక్ష కార్యక్రమంలో పంపిణీ చేసేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి , జెడ్పీ సిఈఓ జె.మోహన్‌రావు, డిఆర్ఓ కె.చంద్రశేఖర్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐటిఐ రెండో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-తెనాలి : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కళాశాలల్లో ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెనాలి ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్, అడ్మిషన్స్ కన్వీనర్ రావి చినవెంక టేశ్వర్లు బుధవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 31లోగా ఐటిఐ.ఎపి.జిఓవి.ఇన్ వెబ్‌లో దరఖాస్తు చేసు కుని, తెనాలి ప్రభుత్వ ఐటిఐ కళాశాలోగాని, గుంటూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాల్లోగాని ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాలన్నారు. పరిశీలన పూర్తయి నవారే కౌన్సెలింగ్‌కు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వ ఐటిఐ కళాశాలల్లో 3, 4 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్ ఉంటుందని, ప్రభుత్వ ఐటిఐ కళాశాలల్లో వచ్చేనెల 5, 6, 7 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. వివరాలకు కళాశాల పనివేళల్లో 9347795839, 9014491772 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధిపై ఎమ్మెల్యే, నాయకులు పొంతన లేని మాటలు : టిడిపి

ప్రజాశక్తి-తెనాలి : పట్టణంలో అభివృద్ధిపై ఒక్కో వార్డులో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ రూ.కోట్లలో లెక్కలు చెబుతుంటే, ఆ పార్టీకే చెందిన ఆ వార్డు కౌన్సిలర్ రూ.లక్షల్లో లెక్కలు చెబుతున్నారని టిడిపి 15వ వార్డు విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గిరి గణేస్ మాట్లాడుతూ 15వ వార్డులో అభివృద్ధికి రూ.3.40 కోట్లు ఖర్చు చేశామని ఎమ్మెల్యే చెబుతుంటే, కౌన్సిలర్ మాత్రం రూ.60లతో అభివృద్ధి చేసినట్లు చెబుతున్నారన్నారు. వార్డు అబివృద్ధిపై ప్రశ్నిస్తే అధికార పార్టీ నాయకులు వ్యక్తిగత దూషణలకు దిగటం సరికాదన్నారు. వి.సులోచన, ఎఫ్.దుర్గ, దివి సత్యం, గిరి ఆంజనే యులు, కె.గిరి, చందు, సాయి, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

యువతి వివాహానికి సాయం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్ : స్థానిక 1వ వార్డు నిరుపేద కుటుంబానికి చెందిన షేక్ రసూల్ కుమార్తె వివాహానికి పొన్నూరు అంజుమన్ కమిటీ తరుపున బీరువాను బుధవారం అందించారు. అంజుమన్ కమిటీ అధ్యక్షులు షేక్ మహమ్మద్(మాము), ట్రెజరర్ షేక్ కరీముల్లా, డైరెక్టర్లు షేక్ హుస్సేన్, సయ్యద్ జిలాని, ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ నాయకులు షేక్ మెమన్‌బాష, మైనార్టీ నాయకులు, షేక్ షకీల్, పఠాన్ హబీబుల్లా ఖాన్ పాల్గొన్నారు.

అసైన్డ్ కౌలు కోసం మోకాళ్లపై నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి గ్రామాల్లోని అసైన్డ్ భూములకు ప్రభుత్వం తక్షణమే కౌలు చెల్లించాలని రైతులు, మహిళలు డిమాండ్ చేశారు. ఉద్దండరాయునిపాలెం రైతు దీక్షా శిబిరం వద్ద అసైన్డ్ రైతులు బుధవారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అసైన్డ్ రైతు పులి చిన్నా మాట్లాడుతూ దళితులు, ఇతర పేద వర్గాలకు చెందిన అసైన్డ్ రైతులకు ప్రభుత్వం విచారణ పేరుతో కౌలు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు లేవని, ప్రత్యమ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవడంతో అసైన్డ్ రైతుల కుటుంబాలు రోజు గడవని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయని అన్నారు. తక్షణమే కౌలు చెల్లించాలని కోరారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న దీక్షలు బుధవారంతో 1303వ రోజుకు చేరాయి. తుళ్లూరు, అనంతవరం, ఉద్దండరాయునిపాలెం, వెంకటపాలెం, నెక్కల్లు తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి. అమరావతి వెలుగులో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అని నినాదాలు చేశారు.

విఐటి-ఐఎస్‌డిసి మధ్య ఒప్పందం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలోని విఐటి - స్కూల్ ఆఫ్ బిజినెస్, విశ్వవిద్యాలయం, ఐఎస్‌డిసి - యుకె మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. అవగాహన ఒప్పందం ప్రకారం, విఐటి విశ్వవిద్యాలయంలో డిజిటల్ మార్కెటింగ్ స్పెషలైజేషన్‌ను అభ్యసిస్తున్న బిబిఎ విద్యార్థులకు డిజిటల్ మార్కెటింగ్‌లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఐఎస్‌డిసి సర్టిఫికెట్‌ను అందిస్తుంది. బిబిఎ ఫిన్‌టెక్ స్పెషలైజేషన్ విద్యార్థుల కోసం ఎసిసిఎ గుర్తింపుతో ఐఎస్‌డిసి ఫిన్‌టెక్‌లో సర్టిఫికెట్‌ను అందిస్తుంది. బి కామ్ (ఫైనాన్స్) విద్యార్థుల కోసం ఎసిసిఎ ఫౌండేషనల్ లెవెల్ సర్టిఫికేషన్ కొరకు అన్ని పేపర్స్ మినహాయింపుతో పాటు ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ అవసరమైన 9 పేపర్స్‌లో మినహాయింపుతో కేవలం 4 పేపర్స్ పూర్తి చేస్తే ఎసిసిఎ ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ పొందే వీలు కలుగుతుంది. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ప్రొఫెషనల్ సర్టిఫికేషన్స్ అందించటంలో విఐటి - ఎ పి స్కూల్ ఆఫ్ బిజినెస్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాజేష్ పూనియా (ఐఎస్‌డిసి జోనల్ హెడ్-సౌత్) మాట్లాడుతూ డిజిటల్ మార్కెటింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో ఐఎస్‌డిసి సర్టిఫికేట్ ప్రాముఖ్యతను వివరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ ఫిన్‌టెక్ సర్టిఫికేషన్ బిటెక్ విద్యార్థులకు కూడా ప్లేస్‌మెంట్ అవకాశాలను మెరుగుపరచటంలో సహాయపడతాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో విఐటి - ఎపి స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ డాక్టర్ శాంతకుమారి, అసోసియేట్ డీన్ డాక్టర్ రాఘవేంద్ర, అఖిల్ అగర్వాల్ (ఐఎస్‌డీసీ ఏపీ, తెలంగాణ రీజనల్ మేనేజర్), డాక్టర్ అరుణ్‌కుమార్ (బిబిఎ ప్రోగ్రామ్ చైర్), డాక్టర్ గోపాలకృష్ణ యూఎం (బీకామ్ ప్రోగ్రామ్ చైర్) పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకుకు సహకరించండి

ప్రజాశక్తి-గుంటూరు

స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేలా మెరుగైన పారిశుధ్య పనులు చేపడుతుందని, ప్రజలు తమ అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్ ద్వారా తెలియచేసి సహకరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నగరంలో 206 వార్డు సచివాలయాల పరిధిలో ఇంటింటి నుండి చెత్త సేకరణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని, ఈ-ఆటోలు కూడా అందుబాటులోకి వచ్చినందున మరింతగా నూరు శాతం సేకరణ చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. అదే విధంగా నగర సుందరీకరణలో భాగంగా మెయిన్ రోడ్ల డివైడర్లు, ఆర్ఒబిలు, ఆర్‌యుబిల వద్ద పెయింటింగ్ చేయించామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 పోటీల్లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేందుకు నగర ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రజలు నేరుగా mygov platform, swacchata app, 2023 vote for your city app, 2023 vote for your city web\ ద్వారా ఫోన్‌కి వచ్చే ఓటిపిని ఇంటి వద్దకు వచ్చే నగరపాలక సంస్థ వాలంటీర్లు, కార్యదర్శులకు తెలిపి అభిప్రాయాలను తెలియచేయాలని కోరారు.

పుట్లా దేవల్యమ్మకు సన్మానం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పట్టణంలోని పాత పొన్నూరుకు చెందిన స్వాతంత్ర సమరయోధులు, మాజీ ఎమ్మెల్యే పుట్లా సుబ్బయ్య కుమార్తె పుట్లా దేవల్యమ్మను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పొన్నూరు బ్రాంచ్ మేనేజర్ మురళీకృష్ణ, సిబ్బంది బుధవారం సన్మానించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సత్కరించినట్లు మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పుట్లా జైపాల్, పుట్లా గోపాలరావు, పుట్లా సంపత్, డక్కుమళ్ల భూషణం, పుట్లా రాజీవ్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - మేడికొండూరు

మండల సర్వసభ్య సమావేశం మండల కేంద్రమైన మేడికొండూరులోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహిస్తామని ఎంపిడిఒ ప్రభాకర్‌రావు బుధవారం తెలిపారు. సమావేశానికి వైసిపి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పాల్గొంటారని, మండల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అన్ని గ్రామాల సర్పంచులు, శాఖల అధికారులు తప్పకుండా హాజరవ్వాలని కోరారు. గత సమావేశంలో తీసు కున్న లక్ష్యాలు, పురోగతిపైనా సమీక్ష ఉంటుందని తెలిపారు.

జైనముని హత్యకు ఖండన

ప్రజాశక్తి-తెనాలి : కర్ణాటక రాష్ట్రంలో దారుణ హత్యకు గురైన జైన ముని కామకుమార నంది మహారాజ్ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని పట్టణంలోని జైన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. అత్యంత సాధు జీవితం, అహింసవాదంతో జీవించే జైన మునిని కర్కస్యంగా హత్య చేయటం దారుణమన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో వీకే జైన్, అరుణ్ జైన్, ప్రకాష్ జైన్, దినేష్ జైన్, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

అంజుమన్ ఎన్నికలకు నామినేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-మంగళగిరి : అంజుమన్ కమిటీ ఎన్నికల్లో భాగంగా అభ్యర్థుల నామినేషన్ దాఖలు మొదలైంది. తొలుత ఇస్లామిక్ ఫ్రంట్ తరపునుండి షేక్ అక్రం (ఇస్లామిక్ ఫ్రంట్ కన్వీనర్) ఆధ్వర్యంలో బుధవారం 9 మంది పాత మంగళగిరి నుంచి హనీషా ఖాదరి, హజ్రత్ అలీ, టిప్పర్ల బజారు నుంచి అల్లాబక్షు, 13వ వార్డు నుండి (హఫీజ్) బద్రి, అక్బరి, 31వ వార్డు నుండి అబ్దుల్ అలీం, అబ్దుల్ సలీం, కొత్తపేట నుంచి యాసీన్, నూర్ బాషా (మున్నా), టిప్పర్ల బజార్‌లోని క్లాసిక్ కళ్యాణ మండపం ఇస్లామిక్ ఫ్రంట్ ఆఫీసు వద్ద నుండి ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు. ఇదిలా ఉండగా ముస్లిమ్ యువసేన నుండి 9 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా ఆధ్వర్యంలో మలాల డే

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ప్రభుత్వ మహిళా జూనియర్ కాలేజీలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో బుధవారం మలాల డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నగర గరల్స్ కన్వీనర్ బి.సుచరిత మాట్లాడుతూ ఆడపిల్లలందరికీ విద్యను అందించాలని పాకిస్తాన్‌లో 14 ఏళ్ల వయస్సులో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి సాధించిందన్నారు. నేడు మలాల పోరాట స్ఫూర్తి ప్రపంచ వ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వాలు బాలికా విద్యను ప్రోత్సహించటంలో అనేక లోపాలున్నాయన్నారు. మలాల స్ఫూర్తితో బాలికా విద్య కోసం కృషి చేయాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆరిఫా, మౌనిక, తులసి, వాసంతి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక బాలికల జెడ్‌పి పాఠశాలలో ఐద్వా ఆధ్వర్యంలో మలాలా డే నిర్వహించగా ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ మాట్లాడారు. ఆయుధం కాదు కలం పట్టాలి, పుస్తకం పట్టాలి అని ఉద్యమించిన మలాలాను విద్యార్థినులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

జెడ్‌పి పాఠశాలల్లో కలెక్టర్, జెసి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరు జెడ్‌పి పాఠశాలను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను పిలిపించి మళ్లీ పదవ తరగతిలో జాయిన్ చేయించారు. విద్యార్థులకు జెవికె కిట్లను అందజేశారు. మధ్యాహ్నం భోజనం నాణ్యత పరిశీలించారు. అందరూ బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శైలజ, ఎంఇఒలు యేసురత్నం, ఆలిమ్, డిప్యూటీ తహశీల్దార్ కె.శ్రీనివాస్, హెచ్‌ఎం కె.జయప్రద పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు

ఆకస్మిక పర్యటనలో భాగంగా జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి బుధవారం గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డలోని జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. గతేడాది 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ ఏయే కాలేజీల్లో చేరారో సమాచారం సేకరించాలన్నారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సమాచారాన్ని 'చైల్డ్ ఇన్ఫో' వెబ్‌సైట్‌లో నమోదు చేశారా? లేదా? అని అడిగి తెలుసుకొని, చేయకుంటే వెంటనే నమోదు చేయాలని ఆదేశించారు. గతేడాది 10వ తరగతితో పోలిస్తే, ఉత్తీర్ణత శాతం తగ్గడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులను జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనం ఏ విధముగా ఉన్నదో అడిగి తెలుసుకొని విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. జగనన్న విద్య కానుక పంపిణీ వివరాలు, నాడు-నేడు పనుల పురోగతిపై సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ వెంట తహశీల్దార్, ఎంఇఒ పాల్గొన్నారు.

మేడికొండూరు, జొన్నలగడ్డ పాఠశాలల్లో విద్యార్థులతో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారి

రోప్ స్కిప్పింగ్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక విజేత విద్యాలయం క్రీడా ప్రాంగణంలో బుధవారం జిల్లా రోప్ స్కిప్పింగ్ జట్ల ఎంపికలు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎఫ్‌సిఐ అసిస్టెంట్ మేనేజర్ రఘురామ్‌రెడ్డి పాల్గొన్నారు. క్రీడాకారుల్ని పరిచయం చేసుకొని ఎంపిక పోటీలను ప్రారంభించారు. నిత్యం క్రీడలు సాధన చేయటం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి నూతన ఉత్తేజం పెరుగుతుందన్నారు. క్రీడలు దేశ సమైక్యతకు దోహదం చేస్తాయన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29, 30 తేదీల్లో కర్నూల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపి, జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. రోప్‌స్కిప్పింగ్ క్రీడ అభివృద్ధికి తిరుపతిరావు చేస్తున్న కృషిని అభినందించారు. విజేతలకు విజేత విద్యాలయ ప్రిన్సిపాల్ సుహాసిని ప్రశంసాపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా రోప్‌స్కిప్పింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.తిరుపతిరావు, అధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు, అర్బన్ మైదన్ స్పోర్ట్స్ సెంటర్ మేనేజర్ సిహెచ్. మధుబాబు, పిఇటిలు స్వాతి, మహేష్‌బాబు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల్ని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో రాయపాటి శ్రీనివాస్, ఫౌండేషన్ ప్రతినిధులు

నార్త్ సౌత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉపకార వేతనాలు ఎంతోగానో దోహదపడతాయని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం నార్త్ సౌత్ ఫౌండేషన్ (యుఎస్‌ఎ) ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను పంపిణీ చేశారు. కళాశాల యాజమాన్యం, నార్త్ సౌత్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధుల చేతులమీదుగా కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన 94 మంది అర్హత కలిగిన ప్రతిభ గల పేద విద్యార్థులకు రూ.23.25 లక్షల చెక్కులను అందించారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థి ఉజ్వల భవిష్యత్‌కు విద్యే సరైన మార్గమని భావించి, సేవే లక్ష్యంగా నాగార్జునా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో 7 రకాల విద్యా సంస్థలు నడుపుతున్నామని చెప్పారు. 1989 నుండి నార్త్ సౌత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యారంగంలో సేవలు అందించటం అభినందనీయమన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్ర హాస్పిటల్ డైరెక్టర్ లయన్ డాక్టర్ అచ్యుతబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన ఉన్నత లక్ష్య సాధనకు విద్యార్థి దశ నుండే గొప్ప వ్యక్తిత్వం, గొప్ప మానవ సంబంధాలు, వృత్తిపై గౌరవం, సామాజిక బాధ్యత వంటి లక్షణాలు కలిగి ఉండాలన్నారు. నార్త్ సౌత్ ఫౌండేషన్ విజయవాడ చాప్టర్ కో-ఆర్డినేటర్ లయన్ సూరపనేని వెంకటరత్నం మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులు మంచి ఉద్యోగాలు చేస్తూ తమ వేతనంలో కొంత భాగం పేద విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందించి మరొకరికి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన నూతన కార్యవర్గం

ఐలు నూతన నగర కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) గుంటూరు నగర నూతన కమిటీ ఎన్నికైంది. జిల్లా అధ్యక్షులు డాక్టర్ సయ్యద్‌బాబు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో 30 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షులుగా గండికోట శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శిగా పులి ప్రత్యూష, కార్యదర్శులుగా ఆళ్ల ప్రశాంత్, రషీద్, ఉపాధ్యక్షులుగా ఖాజావలి షేక్, గర్నెపూడి సురేష్, సంయుక్త కార్యదర్శులుగా ఆకుమళ్ల ఖాసిం, కోశాధికారిగా గోళ్ల వెంకట మాధుర్‌ను ఎన్నుకున్నారు. న్యాయ విద్యార్థుల విభాగం నగర అధ్యక్షులుగా కొమ్ము తరుణ్, ప్రధాన కార్యదర్శిగా ఈమని సతీష్, ఉపాధ్యక్షులుగా శివకృష్ణ ఎన్నికయ్యారు. నూతన కమిటీ న్యాయవాదుల సమస్యలపై, న్యాయవిద్యార్థుల సమస్యలపై, న్యాయవాదుల ఉపాధి, రక్షణ, న్యాయ రంగంలో వస్తున్న మార్పులు, మానవ హక్కుల రక్షణ, రాజ్యాంగ, ప్రజాస్వామ్య రక్షణ, మహిళా న్యాయవాదులకు కనీస సౌకర్యాల కల్పన తదితర విషయాలపై చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తుందని నాయకులు తెలిపారు.

సజావుగా ఎఎన్‌యు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్ -2023 పరీక్ష బుధవారం సజావుగా ముగిసినది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరీక్ష బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించారు. ఫలితాలను త్వరలో వెల్లడించి, ప్రవేశాలు చేపడతామని వర్సిటీ విసి ప్రొఫెసర్ పి.రాజశేఖర్ తెలిపారు. పరీక్ష నిర్వహణపై విశ్వవిద్యాలయ ప్రవేశాల విభాగం సంచాలకులు డాక్టర్ జి.అనితను వీసీ అభినదించారు.

జిజిహెచ్‌లో 24 గంటల ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో ప్రైవేట్ సంస్థతో ఒప్పందం చేసుకున్న ల్యాబ్ 24 గంటల పాటు అందుబాటులో తీసుకుని వస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ల్యాబ్‌ను బుధవారం ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో శాంపిల్స్‌ను తీసుకున్న వెంటనే ఫలితాలనూ అందిస్తారని చెప్పారు. కొంతమంది బయట వ్యక్తులు శాంపిల్స్‌ను తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయని, ఎవరైనా ఇలా చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

స్కూల్ బస్సును ఢీ కొట్టిన మరో స్కూల్ బస్సు

ప్రజాశక్తి - దాచేపల్లి

మరో బస్సును ఢీ కొట్టిన అక్స్‌ఫర్ట్ పాఠశాల బస్సు

విద్యాసంస్థలకు చెందిన రెండు బస్సులు ఢీకొని ఒక విద్యార్థికి స్వల్ప గాయలైన ఘటన మండలంలోని గ్రామాలపాడులో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. మండల కేంద్రమైన దాచేపల్లికి చెందిన ఆక్స్‌ఫర్డ్ పాఠశాల బస్సు, శ్రీచైతన్య పాఠశాల బస్సు విద్యార్థులను ఎక్కించుకునేందుకు బయలుదేరాయి. ఈ క్రమంలో శ్రీచైతన్య స్కూల్ బస్సు గామాలపాడు పెట్రోల్ బంక్ వద్ద ఒక విద్యార్థిని ఎక్కించుకుని యూటర్న్ తీసుకుంటుండగా వెనుక వైపు నుంచి వస్తున్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్ బస్సు ఢీ కొట్టింది. దీంతో శ్రీ చైతన్య స్కూల్ బస్సులోని విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న మున్సిపల్ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య స్పందించి విద్యార్థిని ప్రైవేట్ హాస్పిటల్లో చేర్పించారు. రెండు బస్సులూ విద్యార్థులను ఇక్కడి నుండే ఎక్కించుకోవడం ప్రారంభించాల్సి ఉండడంతో బస్సుల్లో విద్యార్థులు పెద్దగా లేకపోవడంతో ప్రమాదం తప్పింది.